# బురదలో వేళ్ళు

చోడా కోటేశ్వరరావు



స్వంత హాస్పిటల్ ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న కొడుకును చూసుకొని శాంతమ్మ ఇన్నాళ్ళకి తన ఆదర్శాలు తన కళ్ళఎదుట విహరించబోతున్నాయని సంబరపడిపోతూంది. తన ఒడ్డను తాను తీర్చి దిద్దుకుంది. అన్యాయాల నీడ పడకుండా, అక్రమ భావాల గాలి సోకకుండా రామమూర్తిని తాను సాకింది దీనజనసేవను, వ్యధితజీవులఎడ జాలినీ, పరోపకార శీలాన్నీ అతనిలో ఆవహింపజేసింది దీక్షను, దాన్ని నిభాయించుకోగల శిక్షను తన ఒడ కు తాను నేర్పింది. డాక్టర్ని చేసింది వైద్యశాల లేని తమ స్వంత ఊళ్లో హాస్పిటల్ కట్టించి కొడుకును దీనజనసేవకు, వ్యాధి పీడితుల బాధానివారణకు పురికొల్పింది. తాను

జీవితంలో గెల్చింది అందరూ శాంతమ్మ ఔదార్యాన్ని కీర్తించారు. ఆమె ఔదార్యంకంటే రామ్మూర్తి మాతృవాక్యపాలన తత్పరతను మరీ ఆకాశాని కెత్తేశారు. మరి వాస్తవంగా వాళ్ళకు అతనితోనే పని.

వైద్యశాలకు స్థానిక సంఘసేవక ప్రముఖు లొకరు ప్రారంభోత్సవం చేశారు. ప్రజల్లో ఇలాంటి మంచి తనం, ఉదారశీలం ఉండబట్టే దేశం సాగుతున్న దన్నాడు. కేవలం డబ్బు సంపాదనే దృష్టిలో పెట్టు కోకుండా గ్రామీణప్రాంతంలో వైద్య సౌకర్యం కలిగించి ప్రజల ఈతిబాధల్ని తొలగించడమే ఆదర్శంగా పెట్టుకొన్న రామ్మూర్తి సౌజన్యాన్ని, విశాల హృదయాన్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నామన్నారు. డాక్టర్లందరూ ఇలాగే విశాలహృదయంతో నడుము కట్టుకుంటే దేశంలో అనారోగ్యం, వ్యాధులు పాడలెత్తి శంకరగిరి మన్యాలు పట్టిపోతాయన్నారు. ప్రజలందరు డాక్టరుగారికి సహకరిస్తే వారి పూనిక సర్వవిధాల విజయవంతమై తోడి డాక్టర్లకు మార్గదర్శకమవుతుందన్నారు. ప్రజలందరు అన్నప్పుడు రోగులు కానివారుకూడా తమ తంటాలు తాము పడి రోగసంపాదన చేసుకుని రోగులు కావాలన్న అర్థం లేదని అనడానికి వీలులేదు. రామ్మూర్తి పరోపకారమే ప్రధానంగా పూనిన ఈ పని సర్వ విధాలా. . . (ఎవరో ఎక్కడో తుమ్మిన చప్పుడు) . . . విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నానని ముగించారు. దేవుడి పూజ చేయించిన పురోహితుడు నలుగురితోబాటుగా టిఫీనూ, కాఫీ పుచ్చుకోవడమే కాకుండా అక్కడ అతి చౌకగా లభ్యమవుతున్న పరోపకారంలో తాను ప్రధాన భాగ స్వామినని, ప్రథమ భాగస్వామినని అనుకోకపోతే మనను విలవక శాంతమ్మగారిని మరికాసేపు స్తోత్రంచేసి పాతిక రూపాయలూ, దోవతులచాపూ, మోయిమలో చేసుకొన్నవేళకి చేసుకొన్నంత అని అసంపూర్ణతృప్తి పడ్డాడు. లేతవాలీసరుకుకోసమే తహతహలాడిన సంఘసేవక ప్రముఖుడు అలాంటి ఐదారు సరుకులను జీర్ణించుకోలేక పరిస్థితి క్లిష్టమై తద్బాధా నివారణార్థం రామ్మూర్తిచేత ప్రథమంగా ఇంజక్షను చేయించుకొని తన సదాసహాయక హస్తాన్ని రామ్మూర్తి చేతికి అందించాడు. ఎవరో పల్లెటూరి గడుగ్గాయి "దీనజనసేవకి దివ్యమైన బోణీ" అన్నాడు ఏమూలనుండో. ఆదర్శమూర్తి రామ్మూర్తి అమాయికంగా నవ్వుకున్నాడు.

హాస్పిటల్ బ్రహ్మాండంగా సాగుతూంది. దీనజనుల సిరిసకకింద టిఫీనూ, కాఫీలూ దట్టించివచ్చిన వాళ్ళని చూసి పంపడంలో కాఫీ తాగడానికైనా వ్యవధి చిక్కడంలేదు రామ్మూర్తికి. ఆదర్శంవంటబట్టిందంటే అదే వెయ్యేనుగుల బలాన్నిస్తుంది కాఫీ తాగకపోయినా బాధ అనిపించదు. టిఫీను లేక పోయినా ఆకలనిపించదు. భోజనం ఆలస్యమైనా నీరసం రాదు. కొత్తగా కాపురానికి వచ్చిన పడుచు పెళ్ళాం సగంమాత్రమే మిగిలిన సిగ్గుతో, "అబ్బ! ఈ వెన్నెల చూడండి ఎంత అందంగా ఉందో మల్లెపూలు ఆరబోసినట్లు!" అంటే "అబ్బా, నన్ను డిస్టర్బ్ చెయ్యక. రేపు పొద్దున చూసుకోవచ్చు" అంటాడు. రామ్మూర్తి ఈ మాట అనకపోయినా ఇలా అనడు అని హామీఇవ్వడం అంత మంచిపనిగా అనిపించదు. రోగుల సంఖ్య ఎక్కువయ్యేకొద్దీ మందులస్టాకు తగ్గిపోతూంది. కాని జేబులు చూసుకుంటే కళ్ళనీళ్ళు తిరిగి జేబులోకి జారిన కన్నీటిజాడ కనిపించవలిసిందేగాని, అతను రామ్మూర్తి కావడం వల్ల అలా జరగలేదు. రామ్మూర్తి అంటే శాంతమ్మ గారి ఏకైక పుత్రుడు. శాంతమ్మ అంటే మరెక్కడికీ పోవడానికి దిక్కులేక ఆమె నెత్తినబడ్డ లక్షలకు అధికారిణి. హరిశ్చంద్రుడులాంటి శాంతమ్మ తత్త్వమూ సూచనలూ చంద్రమతిలాంటి రామ్మూర్తికి దాటరాని గీటులు. రామ్మూర్తి ఆదర్శమూర్తి. అంతే. దానికి ముందూ, తరవాతా ఏముంటాయో అతనికి తెలీదు. ఆదర్శాన్ని నిర్వహించడానికి మూలశక్తి ఏదో, అది నడుస్తున్నది సరియైన బాట అవునో కాదో ఆగి చూసుకోవడానికి వ్యవధి ఏదీ? రోగి అయితేచాలు, అతడెవరు? అతని స్తోమతేమిటి? ఇవి అతనికి అసంభావ్యాలు.

ఒకరోజు ఉదయాన్నే శాంతమ్మ కొడుక్కి టిఫిను పెట్టి తానూ మరో కుర్చీలో కూర్చుని కొడుకుని పరామర్శ చేసింది.

"ఏరా, రాముూ, ఎలా ఉంది, హాస్పిటల్ వ్యవహారం?"

"బాగానే ఉందమ్మా! ఈ రెండునెలల్లోనే దాదా 150 కేసులదాకా పూర్తి అయ్యాయి."

'వచ్చినవాళ్ళు నవ్వుతూ వెళుతున్నారా లేక నిట్టూరుస్తూ పోతున్నారా?"

"నయంకానివాళ్ళుతప్ప నయమైనవాళ్ళు నవ్వుతూనే పోతున్నారమ్మా."

**ప్రేమ**

**ప్రేమ కళ్లతో చూడదు. హృదయంతో గమనిస్తుంది.**

**— షేక్స్పియర్**

"నయంకాకపోతే మనమేమి చేస్తాం? కాని ఎవర్నీ నిలదీసి నిర్బంధించకు."

"నిర్బంధించడం అసలుండదమ్మా! కనీసం వాళ్ళే మరో కేసుకు వస్తే నిరసనగా చూడ్డంకూడా ఉండదు."

"అదీ, ఆదర్శమంటే అలా ఉండాల్ి."

"కాని డబ్బుమాత్రం చేతిదే పడేట్టుందమ్మా."

"పోనీలేరా! మన కింత ఉంది. నాలుగు తరాలు కూర్చుని తిన్నా తరగని ఆస్తి. ఏం చేసుకుంటాం? ఈ రోగులికి సేవచేస్తే పేరూ ప్రతిష్ఠా, పుణ్యమూ పురుషార్థమూను. డబ్బునిగురించి నీవేమీ బెంగ పెట్టుకోకు."

"అబ్బే! అందుకుకాదు. విషయం వచ్చి అన్నాను. అంతే."

"సరే. కాఫీ తాగి హాస్పిటల్కి వెళ్ళు" అంటూ కాఫీ అందించింది గర్వంగా. ఆ గర్వం తన మాటని జవదాటని కొడుకుని చూసుకొని, అతనిద్వారా తాను చేస్తున్న సేవను తలుచుకొని.

కాఫీ తాగేసి రామ్మూర్తి హాస్పిటల్కి వెళ్ళిపోయాడు. రోగులు అప్పటికే చాలామంది నిరీక్షిస్తున్నారు. ఒక్కొక్కరినే శ్రద్ధగా చూసి మందు రాసి కంపౌండరు దగ్గిరికి పంపిస్తున్నాడు.

ఎముకలపోగులా ఉన్న ఒకతన్ని పరీక్ష చేస్తూ "ఏం చేస్తుంటావు?" అడిగాడు.

"కూలిపని సేత్తానండి."

"ఎన్నాళ్ళబట్టి ఈ జబ్బు?"

"దాదాపు ఆరేడు మాసాలమట్టి, బాబూ!"

"ఇంత ఆలస్యం చేశావేం?"

మాట్లాడలేదు రోగి.

"నిన్నే, మాట్లాడవేం? ఎందు కింత ముంచుకు వచ్చిందాకా ఊరుకొన్నావ్?"

"ఏం సెప్పేది, బాబూ! పూటకి లేనోణ్ణి. డాట్టరు దగ్గిరికి పోతే మందులు రాసిత్తారు. వాటిని కొనేందుకు డబ్బు కావాలా! సూట్టం అంటే ఊరికే సూత్తారు గాని మందులు ఊరికే ఇత్తారా, బాబూ! అందుకని . . ."

"మరి ఇప్పు డెందుకు వచ్చావ్?"

"నాయంతట నేను రాలేదు, బాబయ్యా! నా ఆడది ఏడుత్తుంటే సూళ్ళేక ఈడ తమరు ఉదార బుద్ధిగలోళ్ళు వచ్చారని వచ్చా. మరేం లేదు, బాబూ!"

రామ్మూర్తికి చాలా విచారం వేసింది. 'ఇలాంటివా ళ్ళెందరో! నిజంగా ఇతడు లేనివాడే. లేకపోతే రోగాన్ని ఇంత బాధపడుతూ ముదరనివ్వడు. అందులో వయస్సు 30—35 మధ్య. పాపం, అనుభవించే వయస్సు. కాని అంబాంబు నెత్తిమీద ఉంది. పేలకపోతే అదృష్టవంతుడు. అదంతా భగవదిచ్ఛ. నా పని డ్యూటీ' అనుకొనేసరికి అతని గుండె కరిగి పోయింది.

"సరే, శక్తివంచన లేకుండా ప్రయత్నం చేస్తాను. మందులూ, అవీ నేనే ఇస్తాను. కాని మంచి ఆహారం తీసుకోవాలి. దానికే రెండువంద లవుతుంది. మరి తంటాలుపడతానంటావా?"

రోగి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"మీ రింత దర్మబుద్ధితో మందిత్తానంటేనే నాకు తల వాలిపోతూంది. తిండిగూడా మిమ్మల్నే పెట్టమంటం అన్నాయం, బాబూ! ఇది లోకంలో ఎక్కడా జరగని పని. మేమే తంటాలుపడతాం, బాబూ!"

"సరే" అంటూ కాలింగ్ బెల్ నొక్కాడు. వచ్చి నర్సుతో ఇవ్వవలిసిన మందులు చెప్పి, వాడవలిసిన విధం చెప్పి పంపించేశాడు.

రోగుల్ని చాలామందిని పంపించేశాడు రామ్మూర్తి. రెండుగంటలు కావచ్చింది. భోజనానికి వెళదామను కుంటూండగానే మరో కేసు వచ్చింది. ఇద్దరు స్త్రీలు. ఒకామె వయస్సు దాదాపు నలభై, రెండో ఆమె యువతి. 18, 19 సంవత్సరా లుంటాయనుకున్నాడు.

"ఏమిటి జబ్బు?"

"రహస్యంగా మాట్లాడాలి" అంది నలభైఏళ్ళ స్త్రీ.

ఆఫీసురూములోంచి ప్రైవేటు రూములోకి నడిచారు ముగ్గురూ. వెనకనే తలుపు మూసుకుంది.

"ఇహ చెప్పండి."

"తమరు మాయందు దయ చూపాలి."

"దానికేం. అసలు విషయం చెప్పు."

"ఇది . . ." డాక్టరు కళ్ళు యువతికేసి తిరిగాయి. ఆమె తల వాలిపోయింది. బుగ్గలమీద జాలుగా జారిపోతూంది కన్నీరు.

"నా అక్కకూతురు. పెళ్ళి అవలేదు ఇంకా. కొంప ముంచింది, బాబూ!"

మధ్యాహ్నం రెండు గంటలైంది. భోజనానికి శేలదాముని వరండాలోకి వచ్చాడు రామ్మూర్తి. ఎవరో సాధువు బల్లమీద కూర్చుని ఉన్నాడు.

"ఎవరు నీవు? ఏం కావాలి?"

"నీవు డాక్టరుగా నా కేమీ చెయ్యనక్కర్లేదు. నీ గురించి అందరూ చెప్పుకుంటూ ఉంటే విన్నాను. చూద్దామని వచ్చాను."

"ఎక్కడనించి?"

"ఎక్కడనుండి అయితే నేం?"

"మరి భోజనం?"

"నాలుగు గుమ్మాల దగ్గిరికిపోతే నా ఆకలి తీరదా?"

"సరే పద. ఈ పూట మా ఇంట్లో తిందువుగాని."

"లకోటా" ప్రశ్నలు — లాంగ్టన్




"రాను."

"ఏం?"

"అది అంతే."

"అడుక్కుతినేవాడికి పిలిచి భోజనం పెడతానంటే ఈ బెట్టేమిటి? ఈ అభిమానమేమిటి?"

"అదే లేకపోతే నే నిలా అయ్యేవాణ్ణి గాదు."

"అడుక్కుతినడం కంటే ఆహ్వానిస్తే రావడం అభిమానం పోయే విషయమేమీగాదు."

కొంచెంసేపు తల వంచుకు కూర్చున్న సాధువు "సరే, వస్తాను పద" అని లేచాడు.

వెళ్ళీవెళ్ళగానే తల్లితో ఇద్దరికీ వడ్డించమన్నాడు రామ్మూర్తి. "ఇంకా స్నానం చెయ్యలేదు. మీరు కానివ్వండి" అన్నాడు సాధువు.

రామ్మూర్తి భోజనంచేసి పడుకోవడానికి మేడ మీదికి వెళ్ళిపోయాడు.

శాంతమ్మ వడ్డించింది. సాధువు విస్తరిముందు కూర్చున్నాడు. కాని విస్తరిలో చెయ్యి పెట్టలేదు.

నెయ్యి వడ్డించడానికి వచ్చిన శాంతమ్మ "కలుపుకో, నెయ్యి వేస్తాను" అంది.

ఒక్క క్షణం బాధగా కళ్ళుమూసుకుని ఉత్తరాపోసన పట్టి లేచాడు సాధువు.

"ఏం? ఏమయింది? భోజనం చెయ్యవా?" అంది ఆత్రతతో శాంతమ్మ. సాధువు లేచి వాకిట్లోకి నడిచాడు.

"ఆగు" అని అరిచింది శాంతమ్మ.

గడపలో ఆగిపోయాడు సాధువు.

"ఏమిటిది? పచ్చని లోగిట్లో ఈ అరిష్టమేమిటి?"

"ఏమీలేదు. నీకు వ్రతంలాంటి నిబంధన ఒకటుంది. దాన్ని చెడగొట్టే సాహసం చెయ్యలేక పోతున్నాను."

"ఎవరు? ఎవరది?" రివ్వున గుమ్మంలోకి దూసుకు పోయిన శాంతమ్మ సాధువును పరకాయించి చూసింది.

"మీరా?"

"ఇన్నాళ్ళ తరవాత గూడా నిన్ను చూడాలనే వ్యామోహాన్ని జయించలేక పోయాను. ఓడిపోయాను శాంతా."

శాంతమ్మ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. జ్ఞాపకాల తాకిడికి తలతిరిగి గుమ్మంలోనే కూలబడింది. తీవ్రాతితీవ్రమైన ఉద్వేగం ఆమెను కమ్మివేసింది. కొంతసేపటికి తెప్పరిల్లుకొని అంది:

"ఇవ్వాల్టికి మేము జ్ఞాపకం వచ్చామా?"

"కాదు. ఇవ్వాల్టి వరకు మనసును బంధించాను. ఇహ నావల్ల కాలేదు. చూసిపోదామని వచ్చాను."

"చూసి. . . . . . పోదామని. అవును పోదామనే కాకపోతే ఈ మంచితనం, ఈ ఆదర్శవంతమైన జీవితవిధానం మీకు నచ్చుతాయా?"

"ఇన్నేళ్ల తరవాత, ఈ వయస్సులో, ఈ సంపదలో ఈ ఆదర్శవంతమైన జీవనప్రవృత్తిలో కూడా నీకు ఈ అభిమానం దేనికి?"

"నా రాముకి తండ్రి మీరు. మీరు మానవత్వం లోపించి దుర్మార్గులైనా రామువంటి మంచి బిడ్డను నా కిచ్చారు. అందుకని."

"ఇంకే సంబంధమూ లేదా శాంతా?"

"ఉండడానికి వీల్లేదని ఏనాడో చెప్పాను. యజమానినమ్మి మీచేతికి డబ్బిచ్చి ఏజన్సీకోసం డిపాజిట్ చేసి రమ్మంటే అది తనుపేర కట్టుకొని వచ్చినవారు. నా చెల్లెలికి చిన్నతనంలోనే పసుపుకుంకమ రాలిపోతే ఆమెకు తియ్యని కబుర్లు చెప్పి వలలో వేసుకొని అది గర్భవతి అయి అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకొంటే అదునులో ఆ ఆస్తిని అపహరించినవారు మీరు. డబ్బుకోసం ఇలాంటి నీచమైన పనులు చేసిన మీతో ఎలాంటి సంబంధమూ లేదని ఆ రోజునే చెప్పాను."

"కాని ఈ రోజున చెప్పలేవు."

శాంతమ్మ తెల్లబోయింది.

"ఇక్కడ మంచితనం, ఔదార్యం, మానవత్వం పెంపొందుతున్నాయి. మీలాంటి ప్రవృత్తుల కిక్కడ స్థానం లేదు."

"ఈ సంపదలో హక్కు ఎప్పుడో వదులుకున్నాను. మీరు పొందుతున్న ఔన్నత్యంలో స్థానంకోసం గూడా నేను రాలేదు. ఆ భయం నీ కవసరంలేదు."

"ఇంకా మీరా పద్ధతుల్ని మరిచిపోలేదా?"

"ఏం? నన్నుమార్చి, ఆ మారిన నన్ను చూడ్డానికి ఎవరు తహతహలాడారు? మరిచి పోవడంగాని, అవలంబించడంగాని నా సంతోషంకోసమే అయినప్పుడు అది నా ఇష్టం. నేను వచ్చింది ఒక్క మాటచెప్పి ఒక్క సారి నిన్నూ వాణ్ణీ చూసి వెడదామనే."

అతను వెడతానంటే ఇన్నాళ్ళ తరవాత ఆమెకళ్ళ వెంట కన్నీరు కారుతూంది. ఉండమని చెప్పలేదు. వెడతానంటే కన్నీరాగదు. ఊహలకందని ఏ హృదయాంత రాళాల పొరల్లోని అనురాగ బంధమో, ఏమో!

"చూడు శాంతా! ఇది లోకం. ఇక్కడ మంచితో బాటు చెడూ జరుగుతూంది. నేను చేసినవి మంచివని సమర్థించుకోవడంలేదు. నీవు నన్ను నిరసించి 'నేను మీకు ఏమీ కాను. ఇహ మనిద్దరికీ సంబంధం లేదు. నా చేతి మంచినీళ్ళు గూడా ముట్టుకొనే అవసరం మీకులేదు' అన్నప్పుడు ఇహ నాకు ఫలానిది వున్నదన్న భావమే నశించింది. ఆనాటినుండీ నాకు ఒక జీవితంలేదు. ఒక వృత్తి అని లేదు. నేను ఎవ్వరికీ సహాయపడలేదు. కాని ఒక్కరికీ అన్యాయం చెయ్యలేదు. నాలో మార్పు వచ్చినా రాకపోయినా నీకు కలిగే ప్రయోజనమూ లేదు. అయినా ప్రపంచంలో మనకి తెలియకుండానే కొన్ని విషయాలు జరిగిపోతూ

ఉంటాయి. ఈనాడు నీవు ఆదర్శమూర్తివి. నీ కొడుకు ఆదర్శయువకుడు. అతడు చేస్తున్నది ఆదర్శవృత్తి. ఈ ఆదర్శానికీ, దీన్ని నిర్వహించడానికీ మూలశక్తి ఏదో అవగాహన అయిందా నీకు అదే!... ఆ డబ్బే, నాచేత అన్యాయంగా ఆర్జించబడిన ఆ ధనరాశే! అదే లేకపోతే నీ ఆదర్శాలూ లేవు. నీ కొడుకు మానవుడుగా మనడానికీ, మానవతాదృష్టితో ఇంత సేవ చేయడానికీ ఆస్కారమే లేదు."

"అయితే అంతకీ మీ పాపిష్ఠి డబ్బే కారణమంటారు మీరు!"

"లేదు. నేను అలా అనడంలేదు నీలో సహజంగా మంచితనం ఉంది. నలుగురికీ సహాయం చేద్దామనే సానుభూతి ఉంది. పదుగురినీ బాగు చేద్దామనే ప్రయత్నం ఉంది. నీ బిడ్డకు నా గుణాలు రాగూడదనే ఆకాంక్ష ఉంది. వాడికి నీ ఉద్దేశ్యాలప్రకారం శిక్ష ఇవ్వగల దక్షత ఉంది. ఈ సుగుణాలు బీజాలు. ఇవి మహావృక్షాలై ఫలాల నివ్వడానికి ఆ డబ్బు దోహదం మాత్రమైంది. ఈ దోహదం లేకపోతే అవి చచ్చిపోయేవి. కాని ఇది అసలు విషయంగాదు. నేను చెప్పదలుచుకున్నది మీరు అపాత్రదానం చేస్తున్నారని. అలా బయటికి వెళ్ళిచూడు. నీ కొడుకు మంచితనాన్నే గాదు, వెర్రిబాగులతనాన్ని ఎలా వెక్కిరిస్తున్నారో! లౌకికంగా వాడెంత అప్రయోజకుడై పోతున్నాడో! ఈ మోసాన్ని అదుపులో పెట్టకపోతే అసలు నిజమైన దీనులకు వాడు చేయగలిగేది ఏమీ ఉండదు. చెంబూ తప్పేలా అమ్ముకొని పోవడానికి ఎంతో కాలము పట్టదు. నే ననేది రోగుల్ని పీక్కుతినమనిగాదు. ఆ నీచత్వం నన్ను వదిలిపెట్టింది. తన ఆశయం నిర్విఘ్నంగా సాగాలంటే ముందు తను ఉండాలి. అయినప్పుడు ఈ ధర్మసత్రం ఏమిటి? ఈ సమారాధన ఏమిటి? ఇలా చేస్తే ఎన్నాళ్ళు వస్తుంది? తరవాత మీ ఆదర్శం ఏ గంగలో కలుస్తుంది? ఇలా నాలుగు కాలాలపాటు ఆదర్శాన్ని నిలుపుకోవాలనీ, నిజమైన దీనులకు సేవ చేయాలనీ లేదా మీకు? ఉంటే ఈ ధర్మసత్రపు సమారాధనలు మానివెయ్యండి. మీ జీవనభృతి సంపాదించుకుంటే మీరు రాక్షసులై పోరు. ఈ మాటలు వాడితో చెప్పు. నేను వెళుతున్నాను" అంటూ వెనక్కి తిరగడంలో అతని దృష్టి మెట్లమీద ఆగింది. రామ్మూర్తి చివరి మెట్లమీద నిలబడి నిశ్చేష్టుడై వింటున్నాడు. శాంతమ్మ తలుపు నానుకొని చేరగిలబడింది. కళ్ళు చెమ్మగిల్లి, ఆమె దృష్టి మసకబారింది. "నేను వచ్చిన పని అయిపోయింది. నేను వెళుతున్నాను" అంటూ అడుగు బయటవేశాడు.

"ఆగండి, మీరు వెళ్ళవద్దు" అంటూ అడ్డం నిలబడింది శాంతమ్మ.

"వద్దు శాంతా, ఒకనాడు నీవు పంతంపట్టి నేను వెళ్ళేటట్లు చేశావు. నేనూ అభిమానంతో నీ ముఖం చూడలేదు. మనిద్దరి మధ్య దాంపత్యసంబంధమైన సర్వబంధాలూ ఏనాడో తెగిపోయాయి. ఈ రోజు ఇలా నిర్బంధించడం నీకూ సరువుగాదు. వ్యామోహపడడం నాకూ అభిమానమైన విషయంగాదు."

శాంతమ్మ నిబ్బరించుకుంది. "నేను తెంచుకున్న బంధం నీచప్రవృత్తితోటే కాని దాంపత్యబంధంతో కాదు. నాకు ఇక వేరే పరువు అవసరం లేదు. మీతో ఉండి మీ పరువునే నేనూ పంచుకుంటాను మనస్ఫూర్తిగా."

"లేదు శాంతా, అది ఇక జరగనిపని. నేను బ్రతుకంతా ఏకాకిని. ప్రవాసిని ఈ దురదృష్టం నా కలవాటైపోయింది. నీకు గృహముంది. గృహిణీ ధర్మముంది. మాతృబంధం ఉంది. మాతృధర్మమూ ఉంది. వీటిని నిర్వహించవలసిన కర్తవ్యమూ ఉంది. నీవు నాతో రాకూడదు."

శాంతమ్మ హృదయం భారంగా నిట్టూర్చింది. ఆమె నేత్రాలు బాష్పగుండాలై పోయాయి.

రాము ఈ స్థితి భరించలేకపోయాడు దూసుకుని ముందుకి వచ్చి "మీరు బ్రతిమలాడితే వినేటట్లు లేరు. వాకిట్లో వాదోపవాదాలేమిటి. పదండి లోపలికి" అన్నాడు.

"ఇలా అనే అధికారం నీకున్నది రామూ! కాని నీ తండ్రిగౌరవం మీదా అభిమానంమీదా లక్ష్యమేమైనా ఉంటే అడ్డు తొలుగు" అన్నాడు.

రాము దీనంగా తలవంచుకున్నాడు. సాధువు వడివడిగా బయటికి వెళ్ళిపోయాడు. శాంతమ్మ రాముని కౌగిలించుకొని "నా ఆదర్శాలు మంటగలిసి పోయాయి" అంటూ బావురుమంది.

"లేదమ్మా! మంటగలవబోయిన ఆదర్శాలు రక్షించబడ్డాయి" అంటూ ఓదార్చబోయాడు.

కాని శాంతమ్మ దుఃఖంతో కరిగిన కన్నీటి వెల్లువై పోయింది.

రాము ఆలోచనలు వేరేగా సాగుతున్నాయి. 'ఏమిటీ బ్రతుకులు? ఏమిటీ విచిత్రోదంతాలు? వర్తమానానికి మూల మేమిటి? అనంత పరిమాణాలేమిటి? ఈ మూటినీ ఆవరించుకొనే సుఖదుఃఖాలేమిటి? సభ్యతా సభ్యతలేమిటి? మానవులెంతవరకూ కారకులు? మనుష్యుడే కారకుడైతే వీటిని ఎందుకని తన అదుపులో ఉంచుకోలేకపోతున్నాడో? తన ఆశయాలకు మూల శక్తి అన్యాయార్జిత ధనమా! అన్యాయంలోంచి ఆదర్శం పుట్టిందా! ఇంత ప్రేమమయి అమ్మ హృదయ ప్రవృత్తి ఇంత పాషాణ ప్రాయమా? తన జీవితాన్ని ఇలా చేసుకుందా? అలా చేసుకుని మమతలు మాపుకొని, బంధాలు తెంచుకుని తిరిగి అపూర్వజీవితం కోసం ఆరాటపడుతుందా? దాంపత్యసుఖం కోసం కాకపోవచ్చు. ఆ సాన్నిహిత్యం కోసం, ఆ ధర్మాచరణ కోసం, ఆ బంధంలోని సౌందర్యం కోసం, ఆ జీవన రీతిలోని ఆత్మీయమైన ఒక ఆనంద రోచిస్సు కోసం! కాని... ఏదీ? ఏమైంది? ఈ మహాశూన్యానికి అమ్మ జీవితానికి సంబంధించినంతవరకూ ప్రయోజన మేమున్నది? పరమార్థ మేమున్నది? అయినప్పుడు. ... రాజేశ్వరి చేసినదానిలో ఆమె బాధ్యత ఎంత? ఆమె జీవితం ఎలా పరిణమిస్తుంది? సదా వేదనలో ఇగిరి ఇగిరి పంచ భూతాల్లో కలిసిపోవడమేనా? అమాయికరాలయిన అభిమాని ఆమె. ఈ గుణాలకు ప్రయోజనమేమీ లేదా? తనను సానుభూతితో అర్థం చేసుకొని మన్నించగలిగితే తన విషయాన్ని దాచుకోకుండా అంతా చెప్పివేస్తుందిట! ఎంత. . . . . . . ఎంత ధైర్యం ఆమెకు!' అలా అనుకొనేసరికి అతను అలిసి పోయాడు.


కొంతసేపటికి 'అవును. ప్రయోజనం ఉండాలి. ఆమెను వంచకురాలుగా మారవలసిన అవసరంనుండి తప్పించాలి' అనుకున్నాడు డాక్టర్ రామ్మూర్తి. ★

దేహపుష్టికి ఆరోగ్యానికి
పండిత-డి గోపాలాచార్యులవారి
జీవామృతం
69 సంవత్సరములనుండి ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు.17

1969 లో మీ అదృష్టము
ఏదైన ఒక పుష్పం పేరును, మీ విలువామా యును వ్రాసిన ఒక పోస్టుకార్డు మాత్రం పంపండి. మీకు వచ్చే 12 నెలలో వ్యాపారంలో లాభ నష్టములు, ఉద్యోగంలో ప్రమోషను, బదిలీ, సంతానం, వివాహ సౌఖ్యం మొదలైన విషయములు, దుష్టగ్రహ శాంతి విధానములతో పాటు రు. 1—25 పై. లకు పంపగలము. పోస్టేజి అదనం. ఒకసారి చూచిన మీకే తెలియగలదు.



PT. DEV DUTT SHASTRI
Raj Jyotshi (A.P.)
P.B. No. 86, JULLUNDUR CITY




లిచెన్‌సా
వాడండి
D7 1613 CR-TG